## పాక్ నుంచి స్వదేశానికి శ్రీలంక ఆటగాళ్లు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్‌లో పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. రెండు రోజుల క్రితం జరిగిన బాంబు దాడిలో కనీసం 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఆ దేశ పర్యటనలో ఉన్న శ్రీలంక క్రికెట్ జట్టు తీవ్ర భయాందోళనకు గురైంది. శ్రీలంక జట్టులోని ఎనిమిది మంది ఆటగాళ్లు భద్రతా కారణాలతో పాకిస్థాన్‌ను విడిచి స్వదేశానికి వెళ్లిపోయారు. ఈ పరిణామంతో నవంబరు 14న జరగాల్సిన పాకిస్థాన్ - శ్రీలంక రెండో వన్డేపై అనుమానాలు మొదలయ్యాయి.


# AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN


## అయోధ్యలో రెండు రోజులు దర్శనాల నిలిపివేత



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ఉత్తరప్రదేశ్‌లోని శ్రీరాముడి జన్మభూమి అయోధ్యలో నిర్మించిన రామాలయంలో రెండు రోజుల పాటు దర్శనాలు నిలిపివేయనున్నారు. ఈ నెల 24 సాయంత్రం నుంచి 26 ఉదయం 7 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతించమని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రకటించింది. అయోధ్య రామ మందిరంలో ధ్వజారోహణ కార్యక్రమానికి వీలుగా నవంబర్ 24 సాయంత్రం నుంచి శ్రీరామ జన్మభూమి ఆలయం మూసి వేయనున్నారు.


13-11-2025 (Thursday) MAIN EDITION


## బస్టాండ్ కోసం తెప్పలతో నిరసన



**అక్షరటుడే, వరంగల్ : వరంగల్ బస్టాండ్ నిర్మాణం పూర్తి చేయాలంటూ బీజేపీ నాయకులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. బస్టాండ్ నిర్మాణం కోసం తీసిన గుంతలో తెప్పలపై ప్రయాణం చేస్తూ గురువారం నిరసన తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, పొన్నం మాస్కులు ధరించి తెప్పలపై ప్రయాణం చేశారు.**

## ఆర్టీసీ బస్సులో పొగలు



**అక్షరటుడే, గద్వాల : జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం మద్దూరు స్టేజ వద్ద ఆర్టీసీ బస్సులో పొగలు వచ్చాయి. అయిజా నుంచి కర్నూలు వెళ్తున్న బస్సు వెనుక టైర్ పొగలు రావడంతో డ్రైవర్ అప్రమత్తం అయ్యాడు. బస్సును నిలిపేసి, ప్రయాణికులను కిందకు దింపారు. అనంతరం నీళ్లు చల్లి మంటలను ఆర్పివేశారు.**

## కొండగట్టులో ధరల పెంపుపై ఆగ్రహం



**అక్షరటుడే, కరీంనగర్ : కొండగట్టు ఆలయంలో ఆర్జిత సేవా రుసుం పెంచడంపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు టికెట్ల ధరలను ఇటీవల అధికారులు పెంచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బండి సంజయ్ తాజాగా స్పందిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస సౌకర్యాలు లేవు కానీ, ఇష్టమొచ్చినట్లు రేట్లు పెంచేస్తారా అని నిలదీశారు.**

## ప్లాస్టిక్ గోదాంలో భారీ అగ్ని ప్రమాదం



**అక్షరటుడే, రంగారెడ్డి :** ప్లాస్టిక్ గోదాంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిపడ్డాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాహిన్‌నగర్‌లో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షాహిన్ నగర్ సాయిబాబా ఆలయం వెనుక భాగంలో ప్లాస్టిక్ గోదాం ఉంది. తెల్లావారుజామున 3:30 గంటల సమయంలో అందులో అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో మంటలు చెలరేగి భారీగా ఎగిసిపడ్డాయి. వెంటనే స్థానికులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని రెండు ఫైరింజన్ల సాయంతో మంటలను ఆర్పివేశారు.

## మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కేసు

**అక్షరటుడే, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుపై కేసు నమోదైంది. విధుల్లో పోలీసులకు ఆటంకం కలిగించడంతో పాటు, వారిని బెదిరించారనే ఆరోపణలపై పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సమాచారం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబటి రాంబాబు అనుమతులు పొందకుండానే నిరసన కార్యక్రమం చేపట్టారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రజలకు అసౌకర్యం కలిగింది. ఈ నేపథ్యంలో ఆయనతో పాటు పలువురిపై బీఎన్ఎస్ సెక్షన్లు 132, 126(2), 351(3), 189(2), రీడ్ విత్ 190 కింద కేసు నమోదు చేశారు.

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపెవరిదో మరికొన్ని గంటల్లో తేలనుంది. ఉప ఎన్నికల్లో గెలుపు కోసం ప్రధాన పార్టీలు సర్వశక్తులు ఒడ్డాయి. అయితే కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య నువ్వా నేనా అన్నట్లు పోటీ సాగింది. ఈ నెల 11 పోలింగ్ జరగ్గా.. 48.89 శాతం ఓటింగ్ నమోదైంది. అయితే ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ గెలుస్తుందని ప్రకటించగా.. అసలు ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓటరు తీర్పు ఏమిటో శుక్రవారం తెలియనుంది.**

**– అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



# జూబ్లీహిల్స్‌లో గెలుపెవరిదో..

**■ రేపు ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం ■ 42 టేబుళ్లలో ఓట్ల లెక్కింపు ■ మధ్యాహ్నం వరకు తేలనున్న ఫలితం**

బీఆర్ఎస్ నుంచి గెలిచిన మాగంటి గోపినాథ్ మృతితో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు వచ్చాయి. ఇక్కడి నుంచి బీఆర్ఎస్ తరఫున గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత బరిలో నిలిచారు. కాంగ్రెస్ తన అభ్యర్థిగా నవీన్ యాదవ్‌ను, బీజేపీ లంకల దీపక్‌రెడ్డిని పోటీలో నిలిపాయి. ఉప ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా శ్రమించింది. పలువురు మంత్రులు నియోజకవర్గంలోనే తిష్ట వేశారు. మరోవైపు మైనారిటీ ఓట్ల కోసం ఎంఐఎం మద్దతు తీసుకోవడంతో పాటు అజారుద్దీన్‌కు మంత్రి పదవి సైతం ఇచ్చింది. బీఆర్ఎస్ సైతం దూకుడుగా ప్రచారం చేసింది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లింది. కాంగ్రెస్ హామీలు అమలు చేయడం లేదని ఇంటింటికి బాకీ కార్డులు పంపిణీ చేసింది. అయితే ఓటరు ఎవరికి మద్దతుగా నిలిచారనేది శుక్రవారం తేలనుంది.

### కౌంటింగ్‌కు ఏర్పాట్లు

యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఈవీఎంలను భద్రపరిచారు. అక్కడే కౌంటింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఈ మేరకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. కౌటింగ్ కోసం 42 టేబుళ్లు సిద్ధం చేశారు. ఒక్కో టేబుల్ వద్ద ముగ్గురు అధికారులు ఉంటారు. 10 రౌండ్లలో ఉప ఎన్నిక ఫలితాలు తేలనున్నాయి. ఒకటో నెంబర్ పోలింగ్ బూత్ షేక్‌పేట డివిజన్ నుంచి ప్రారంభమై ఎర్రగడ్డతో కౌంటింగ్ ముగుస్తుంది.

### వారితో నష్టం ఎవరికో..

ఉప ఎన్నికల్లో మొత్తం 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా నిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఆర్ఆర్ఆర్ బాధితులు పోటీలో నిలిచారు. భారీ సంఖ్యలో అభ్యర్థులు ఉండడంతో.. వారు ఏ పార్టీకి నష్టం చేశారో రేపు తేలనుంది. అలాగే బీఆర్ఎస్ కారు గుర్తును పోలిన రోడ్ రోలర్, చపాతి మేకర్, ఆటో, సబ్బు పెట్టె గుర్తులను పలువురు అభ్యర్థులకు ఈసీ కేటాయించింది.

ఆ గుర్తులతో బీఆర్ఎస్‌కు ఏమైనా నష్టం జరుగుతుందా అనేది తెలియనుంది. అన్ని ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ గెలుస్తుందని చెప్పాయి. అయితే ఓటింగ్ శాతంలో స్వల్పంగా తేడా ఉన్నట్లు ఆయా పోల్స్ పేర్కొన్నాయి. దీంతో అసలు ఫలితాలు ఎలా ఉంటాయోనని ప్రజలు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. అభ్యర్థులు ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో సంబంధం లేకుండా గెలుపుపై లెక్కలు వేసుకుంటున్నారు.

### వైన్స్‌లు బంద్

ఉప ఎన్నిక కౌంటింగ్ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో శుక్రవారం అన్ని లిక్కర్ షాపులు మూసి ఉంచాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వైన్స్, బార్లు, కల్లు కాంపౌండ్‌లకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసులు తెలిపారు.

## ఆర్టీసీ రెవెన్యూ పెంచేందుకు మార్గాలు అన్వేషించాలి: పొన్నం



**అక్షరటుడే, హైదరాబాద్:** ఆర్టీసీ రెవెన్యూ పెంచేందుకు మార్గాలు అన్వేషించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త కాలనీలకు బస్సు రూట్‌లు పెంచేలా అధ్యయనం చేయాలన్నారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ డిపోలు లాభాల్లోకి వచ్చేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఆరంఘర్‌లో బస్సు టెర్మినల్ కోసం పోలీసు శాఖ భూములపై చర్చించాలన్నారు. హైదరాబాద్‌లో కొత్త డిపోలకు స్థల పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బస్సు ప్రమాదాలను తగ్గించేందుకు డ్రైవర్ మానిటరింగ్ సిస్టం అమలు చేస్తామన్నారు. త్వరలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తామని చెప్పారు.

## హైదరాబాద్‌లో గుజరాత్ పోలీసుల సోదాలు



**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని రాజేంద్రనగర్‌లో గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ పోలీసులు అర్ధరాత్రి సోదాలు చేశారు. ఫోర్త్ వ్యూ కాలనీలోని డాక్టర్ సయ్యద్ మొహియుద్దీన్ ఇంట్లో తనిఖీలు చేపట్టారు. ఉగ్రవాద ఆరోపణలతో డాక్టర్ సయ్యద్‌ను గుజరాత్ పోలీసులు ఇదివరకే అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ప్రమాదకర విషం రెసిన్ తయారు చేసి సామూహిక హత్యలకు సయ్యద్ కుట్ర పన్నినట్లు గుర్తించారు. ఈ క్రమంలో అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారి, ఐదుగురు సభ్యుల బృందం మంగళవారం అర్ధరాత్రి అతడి ఇంట్లో సోదాలు చేపట్టింది. అతడి ఇంట్లో మూడు రకాల లిక్విడ్‌తో పాటు కంప్యూటర్, పలు రకాల బుక్స్, ఆయిల్ తయారుచేసే మిషన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పలు కీలక డాక్యుమెంట్లను సైతం గుర్తించారు. వాటిని సీజ్ చేసి గుజరాత్ తీసుకెళ్లారు.

## డీఎన్ఏ ద్వారా నిందితుడి గుర్తింపు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం సాయంత్రం చోటుచేసుకున్న కారు పేలుడు ఘటనలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు డాక్టర్ ఉమర్ ఉన్ నబీ అని డీఎన్ఏ పరీక్షల ద్వారా దర్యాప్తు సంస్థలు నిర్ధారించాయి. ఈ పేలుడులో 12 మంది మృతి చెందగా.. 20 మందికిపైగా గాయపడ్డారు. దర్యాప్తు బృందాలు ఉమర్ తల్లి డీఎన్ఏ నమూనాలను, ఘటనా స్థలంలో కారు నుంచి స్వాధీనం చేసుకున్న ఎముకలు, దంతాలతో సరిపోల్చగా, అవి పూర్తిగా సరిపోయాయి. పేలుడు జరిగిన క్షణంలో ఉమర్ కాలు స్టీరింగ్ వీల్, యాక్సిలరేటర్ మధ్య చిక్కుకుపోయినట్లు కూడా తేలింది. దీంతో కారును నడిపింది ఉమరేనని స్పష్టమైంది.

## అమెరికాలో ముగిసిన షట్‌డౌన్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అగ్రరాజ్యం అమెరికాలో షట్‌డౌన్ ముగిసింది. అక్టోబర్ 1 నుంచి కొనసాగిన ఆర్థిక షట్‌డౌన్ బుధవారం రాత్రి (అమెరికా కాలమానం ప్రకారం) ముగిసింది. అయితే.. రెండు ఆర్థిక బిల్లులకు ఆమోదం లభించకపోవడంతో ప్రభుత్వం షట్‌డౌన్ అయిన విషయం తెలిసిందే. దీంతో అక్టోబర్ 1 నుంచి షట్‌డౌన్ ప్రారంభమైంది. దీని ప్రభావంతో అగ్రరాజ్యంలో అనేక విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది. ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు దానికి ముగింపు పలికే బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. కాగా.. 43 రోజుల పాటు ప్రభుత్వం షట్ డౌన్ అయింది. ఆ దేశ చరిత్రలో ఇదే అతి పెద్దది కావడం గమనార్హం. గతంలో ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 35 రోజులు ప్రభుత్వం షట్‌డౌన్ అయింది.

## పాక్ ఆర్మీ చీఫ్‌కు అపరిమిత అధికారాలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్‌కు అపరిమిత అధికారాలు కల్పించింది. ఈ మేరకు తాజాగా ఆయన అధికారాలు విస్తరించేందుకు అవసరమయ్యే రాజ్యాంగ సవరణకు అక్కడి పార్లమెంటు ఆమోదం తెలిపింది. కాగా, దీనిపై ప్రతిపక్షం ఆందోళన వ్యక్తం చేసింది. 27వ రాజ్యాంగ సవరణకు పార్లమెంటు దిగువ సభ మూడింట రెండొంతుల కంటే ఎక్కువ మెజారిటీతో ఆమోదం లభించింది. కేవలం నలుగురు శాసనసభ్యులు మాత్రమే దీనికి వ్యతిరేకంగా ఓటు వేశారు. ఎగువ సభలో రెండు రోజుల క్రితమే బిల్లుకు ఆమోదం లభించింది. రాష్ట్రపతి సంతకం అనంతరం ఇది చట్టంగా మారనుంది. దీని ప్రకారం.. ఆర్మీ చీఫ్‌గా ఉన్న ఆసిం మునీర్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. దీంతో ఆయనకు జీవితకాల రక్షణ లభించనుంది.

## జేపీ ఇన్‌ఫ్రాటెక్ ఎండీ మనోజ్ గౌర్ అరెస్ట్

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** జేపీ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మనోజ్ గౌర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసింది. గృహ కొనుగోలుదారులను మోసం చేసి వారి డబ్బును మళ్లించిన కేసులో అరెస్ట్ చేసినట్లు ఓ ఆంగ్ల పత్రిక పేర్కొంది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం 2002 కింద ఈ కేసు నమోదైందని సమాచారం. ఈ ఏడాది మేలో జేపీ ఇన్‌ఫ్రాటెక్, జేపీ అసోసియేట్‌స్‌తో పాటు వాటి అనుబంధ సంస్థల్లో ఈడీ సోదాలు నిర్వహించింది. ఈ దాడుల్లో రూ.1.7 కోట్ల నగదు, ఆర్థిక లావాదేవీల పత్రాలు, డిజిటల్ డేటా, ప్రమోటర్లు, వారి కుటుంబసభ్యులు, గ్రూప్ కంపెనీల పేర్లపై నమోదైన ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## నన్ను చంపాలనుకున్నారు: అదాశర్మ



**విలక్షణమైన కథలు, విభిన్న పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నటి అదా శర్మ. ఈ అమ్మడు సంచలన వ్యాఖ్యలతో తాజాగా వార్తల్లో నిలిచారు. 2023లో విడుదలైన సినిమా "ది కేరళ స్టోరీ" దేశవ్యాప్తంగా భారీ చర్చకు దారితీసింది. ఈ సినిమా తర్వాత తన జీవితం, కెరీర్‌లో జరిగిన మార్పుల గురించి అదా తాజాగా ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. అదా మాట్లాడుతూ.. "రిస్క్ ఉన్న పాత్రలు చేసినప్పుడే కెరీర్‌కు నిజమైన విలువ వస్తుంది. నా సినీ ప్రయాణం '1920' సినిమాతో ప్రారంభమైంది. 'ది కేరళ స్టోరీ' విడుదల సమయంలో నాకు తీవ్రంగా బెదిరింపులు వచ్చాయి. దేశంలోని సగం మంది నన్ను చంపాలని అనుకున్నారు, మిగతా సగం మంది మాత్రం నాపై ప్రేమ, మద్దతు, ప్రశంసలు కురిపించారు. వారే నన్ను రక్షించారు. అని అదా చెప్పింది.**

**–అక్షరటుడే, సినిమాడెస్క్**